సాక్షి అనకాపల్లి

బుధవారం, 20, నవంబర్, 2024



బాలోత్సవ్

డాబాగార్డెన్స్: విశాఖలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బాలోత్సవ్ వేడుకగా ప్రారంభమైంది. 8లో



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : విశాఖ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 32.2 నుంచి 32.8 డిగ్రీల వరకు నమోదవుతాయని, గాలి గంటకు 1 నుంచి 4 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

వచ్చే నెల 2 నుంచి నృసింహ దీక్షలు



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షలు డిసెంబర్ 2 నుంచి ప్రారంభమవుతాయని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు మంగళవారం తెలిపారు. దేవస్థానం వైదికులు నిర్ణయించిన ప్రకారం 2 నుంచి మండల దీక్ష, 12 నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభంకానున్నట్లు పేర్కొన్నారు. ఆయా రోజుల్లో దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం తరఫున మాలధారణ చేసి, తులసి మాల, స్వామివారి ప్రతిమ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షలు విరమించాల్సి ఉంటుందన్నారు. దీక్ష చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

పూడిమడక రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

- అనకాపల్లి ఆర్డీవో ఆయిషా



సర్వేయర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆయిషా

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా కోరారు. మంగళవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుతో చర్చించారు. అనంతరం మునగపాక మెయిన్ రోడ్డు విస్తరణలో కోల్పోనున్న గృహాలతోపాటు వ్యవసాయ భూములను ఆమె పరిశీలించారు. మునగపాక మండల పరిధిలోని రెవెన్యూకు సంబంధించి సర్వే పనులు పూర్తి చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. అలాగే మునగపాక బాధితులకు ఎంత పరిహారం ఖరారు చేశారని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంతలో పనులు వేగవంతం చేసి విస్తరణకు అవసరమయ్యే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ తుహిన్ సిన్హా



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

నర్సీపట్నం: నర్సీపట్నం టౌన్, రూరల్ పోలీసు స్టేషన్లను ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం తనిఖీ చేశారు. రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, ప్రస్తుతం వారు జీవనోపాధికి ఏమేమి పనులు చేస్తున్నారో ఆరా తీశారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా సహకరించాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఆకస్మిక, డైనమిక్ తనిఖీలు చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ మోహన్ ఉన్నారు.

డౌనూరు చెక్‌పోస్టు తనిఖీ

అనకాపల్లి, అల్లూరి జిల్లాల సరిహద్దులో డౌనూరు వద్ద ఉన్న ఎన్‌డీపీఎస్ చెక్‌పోస్టును ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లో నమోదైన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది వాహన తనిఖీలను పర్యవేక్షించి సూచనలు చేశారు.

లోకమాన్యతిలక్ టెర్మినస్-భువనేశ్వర్ వన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం లోకమాన్య తిలక్ టెర్మినస్-భువనేశ్వర్ మధ్య విశాఖపట్నం మీదుగా వన్ వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. లోకమాన్యతిలక్ టెర్మినస్-భువనేశ్వర్(01097) వన్ వే స్పెషల్ మంగళవారం అర్ధరాత్రి తర్వాత((బుధవారం) 12.45 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయలుదేరుతుంది. గురువారం తెల్లవారు 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుని, అదే రోజు ఉదయం 10.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది.

పీసీ మహలనోబిస్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ (విశాఖ): ప్రపంచ ప్రఖ్యాత గణాంకవేత్త ఆచార్య పీసీ మహలనోబిస్ పేరిట అందించే అవార్డుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సెట్విన్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.సత్యపద్మ తెలిపారు. ఈ అవార్డు స్టాటస్టిక్స్‌లో విస్తృత పరిశోధనలు, గణాంక పద్ధతులను ప్రోత్సహించిన వారికి ఈ అవార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు ద్వారా రూ.10 వేల యూఎస్ డాలర్స్ నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, మెమెంటో అందిస్తామన్నారు. https://www.isi-web.org పోర్టల్ ద్వారా డిసెంబర్ 31వ తేదీలోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పుత్తడి బొమ్మకు.. పుస్తెల బంధనం!



- చిన్నారిని చేయొద్దు పెళ్లికూతురు
- జిల్లాలో కలవరపరుస్తున్న బాల్య వివాహాలు
- వయసు రాకుండానే పెళ్లి పీటలెక్కుతున్న బాలికలు
- చట్టాలున్నా చట్టుబండలే

రెండేళ్లలో ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాలు **151**

బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం టోల్ ఫ్రీ నంబర్ **1098**



అనకాపల్లిలో బాల్య వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు, పోలీసులు

> ఎస్.రాయవరం మండలానికి చెందిన 16 ఏళ్ల బాలికకు సమీప బంధువుతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. తాను చదువుకుంటానని ఈ వివాహం ఇష్టం లేదని ఏడ్చి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. పైగా తాము నిశ్చయించిన వివాహం చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తండ్రి హెచ్చరించడంతో బాలిక వివాహం చేసుకోక తప్పలేదు.

> ఇటీవల అనకాపల్లి గాంధీ నగరం పరిధిలో ఓ 17 ఏళ్ల బాలికకు తల్లిదండ్రులు వివాహం నిశ్చయించారు. బాలిక తరఫున ఎవరో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లి వివాహాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ అధికారులపై బాలిక బంధువొకరు తిరగబడ్డాడు. పోలీసుల సాయంతో అతికష్టం మీద తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆ వివాహాన్ని ఆపారు.

> కశింకోటకు చెందిన ఓ 16 ఏళ్ల బాలికకు మేనమామతో వివాహం జరిపించారు. ఓ కుమారుడు పుట్టిన తర్వాత రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందాడు. ప్రస్తుతం ఆమె భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. డిగ్రీ పూర్తి చేసుకుని తన స్నేహితురాళ్లు పోటీ పరీక్షలకు ప్రిపేరవుతుండడంతో వివాహంతో తన భవిష్యత్తు అంధకారమైందని ఆమె వాపోయింది.

> యలమంచిలి పట్టణంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి పదో తరగతి పూర్తయిన 15 ఏళ్ల బాలికను ప్రసవం కోసం తీసుకురావడంతో వైద్యులు నివ్వెరపోయారు. తమ వద్ద డెలివరీ చేయడానికి కుదరదని చెప్పడంతో వారు పక్క జిల్లాలో ఆస్పత్రికి బాలికను తీసుకెళ్లిపోయారు. ఈ విషయం బాలిక నివసిస్తున్న గ్రామంలో ఐసీడీఎస్, మహిళా పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

యలమంచిలి రూరల్:

ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో ఎంత ముందుకెళ్లినా.. ఇంకా కొందరి ఆలోచనల్లో మార్పు రావడం లేదు. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల బంధనం తప్పడం లేదు. ఇందుకు నిరక్షరాస్యత, పేదరికం కొంత కారణం కాగా.. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మరో ప్రధాన కారణం. తమ బాధ్యత తీరిపోతుందని భావిస్తున్న కొందరు తల్లిదండ్రుల ఆడపిల్లలకు పెళ్లీడు రాకముందే వివాహాలు చేస్తున్నారు. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో స్వేచ్ఛగా చదువుకోవాల్సిన బాలికల మెడల్లో పుస్తెల తాళ్లు పడుతున్నాయి. లోకం పోకడ తెలియకుండానే బిడ్డలకు బాల్యంలోనే వివాహాలు చేసి వారి జీవితాలను కొందరు తల్లిదండ్రులు చేజేతులా అగాధంలోకి నెడుతున్నారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేస్తే అనారోగ్యంతో కుంగిపోతారని వైద్యులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

అడ్డుకుంటున్నా.. ఆగడం లేదు

బాల్య వివాహాలను మాతాశిశు సంక్షేమ అధికారులు అడ్డుకుంటున్నా వివాహాలు ఆగడం లేదు. అధికారులు తమకున్న సమాచారంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాలికతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో కొంతవరకు బాల్య వివాహాలు తగ్గినట్టు కనిపిస్తున్నా, లోలోపల మాత్రం గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు చేస్తున్నారు. చాలా చోట్ల జరుగుతున్న బాల్య వివాహాలకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా తెలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడినవారు ఆర్థికంగా బలంగా ఉన్న వారికి తమ కుమార్తెలను ఇచ్చి పెళ్లి చేస్తే, అమ్మాయి జీవితం బాగుంటుందని భావిస్తున్నారు. పెద్దయితే తాము చెప్పిన సంబంధం చేసుకుంటుందో లేదో అనే ఆలోచనతో మరికొందరు, ప్రేమలో పడి తల్లిదండ్రులకు చెడ్డపేరు తెస్తుందేమోనన్న భయంతో ఇంకొందరు.. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో గత రెండేళ్లలో అధికారుల దృష్టికి వచ్చిన 151 బాల్య వివాహాలను అడ్డుకున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. అధికారుల దృష్టికి రాకుండా జరిగిపోతున్న పెళ్లిళ్లు అనేకం ఉంటున్నాయి.





కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంది. వారు సంసారం, కుటుంబం, పిల్లల బాధ్యత మోస్తూనే అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వారు గర్భం దాలిస్తే తల్లికీ, బిడ్డకు ప్రాణాపాయం ఉంటుంది.
- ఎంతో సందడిగా ఆనందోత్సాహాలతో జరగాల్సిన పెళ్లి అధికారుల జోక్యంతో అర్థంతరంగా ఆగిపోతే రెండు కుటుంబాల వారికీ నగుబాటే కదా. అందుకే పెళ్లి వయసు రాకుండా ముహూర్తాలు పెట్టుకొని, అడ్డుకునే పరిస్థితిని తెచ్చుకోవద్దు.
- బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఏటా జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 3 వేల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలోని హైస్కూల్, జూనియర్ కళాశాలల్లో సమావేశం నిర్వహించి బాలికలకు బాల్యవివాహాల వలన కలిగే దుష్ఫలితాలను వివరిస్తారు.

నిద్రావస్థలో యంత్రాంగం

బాల్య వివాహాల నిరోధక చట్టం 2006కు సంబంధించి నిబంధనలను కఠినతరం చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012 మార్చి 19న జీవో నంబరు 13ను విడుదల చేసింది. బాల్య వివాహాలను నివారించి, ప్రజలను చైతన్యం చేసేందుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆ జీవోలో స్పష్టంగా ఉంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఐసీడీఎస్ పీడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కన్వీనర్లుగా ఉన్నారు. డివిజన్ స్థాయిలో డీఎస్పీ, మండల స్థాయిలో తహసీల్దార్, గ్రామ స్థాయిలో సర్పంచ్ చైర్మన్లుగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇన్ని కమిటీలు ఉన్నప్పటికీ బాల్య వివాహాలు ఆగడం లేదు. గ్రామ స్థాయిలో ఉన్న వారందరికీ వారి పరిధిలో ప్రతి విషయం తెలుస్తుంది. కానీ బాల్య వివాహాల నియంత్రణపై ఉదాసీన వైఖరినే అవలంబిస్తున్నారు.

బాల్య వివాహం నేరానికి శిక్ష..

బాల్య వివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

టీనేజ్ ప్రెగ్నెన్సీలతో ప్రాణానికే ప్రమాదం



బాల్య వివాహాల వలన వచ్చే గర్భాల వల్ల బాలికలు ఎనీమియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటుతో మెటర్నల్ డెత్‌లు జరుగుతాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. 6 నెలల క్రితం యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి 17 ఏళ్ల ప్రాయంలోనే గర్భం దాల్చిన కేసు రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాను. చిన్న వయసులో గర్భం దాలిస్తే బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదమే.

–డాక్టర్ ఆర్.నిహారిక, సివిల్ అసిస్టెంట్ సర్జన్, గైనకాలజిస్ట్, యలమంచిలి సీహెచ్‌సీ

అందరూ బాధ్యులే..



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకులు, పురోహితులు, స్నేహితులు, అనుమతించిన పెద్దలు, సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. మైనర్ బాలికను పెళ్లి చేసుకొని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది.

–కె.వి.సత్యనారాయణ, డీఎస్పీ, పరవాడ

సమాచారం ఇవ్వండి



బాల్య వివాహాలు జరిగినట్టు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే ఆ సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి పెళ్లిని ఆపు చేస్తాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. తగిన వయసు లేకపోతే మానసిక, శారీరక పరిపక్వత ఉండదు.

–కె.అనంతలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, అనకాపల్లి

అయ్యన్నను గెలిపిస్తే.. రౌడీరాజ్యమేనని ఆనాడే చెప్పా..



స్పీకర్ పెద్ద కుమారుడు విజయ్‌తో నిందితులు ఉన్న ఫొటో చూపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- స్పీకర్ ఇలాకాలో రౌడీయిజాన్ని అరికట్టాలని డీఎస్పీకి వినతి

నర్సీపట్నం: నియోజకవర్గంలో టీడీపీని గెలిపిస్తే రౌడీలు రాజ్యమేలుతారని ఎన్నికల ప్రచారంలో తాను ఆనాడే చెప్పానని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం డీఎస్పీ మోహన్‌ను కలిసి శాంతిభద్రతలను కాపాడాలని, రౌడీయిజాన్ని అరికట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్ అనుచరులైన రౌడీలు హత్యలు, దాడులకు తెగబడడం వల్ల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలో నియోజకవర్గంలో తరుచూ ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. నాతవరం మండలం చుక్కా రాము అనే వ్యక్తిపై దాడి చేశారని, డి.ఎర్రవరంలో సబ్బవరపు వెంకునాయుడికి చెందిన జీడి తోట నరికేశారన్నారు. చీడిగుమ్మల్లో పాకలు తగులబెట్టి ఇళ్లపై దాడి చేశారని, మాకవరపాలెం మండలం యరకన్నపాలేనికి చెందిన కొల్లు అప్పలనాయుడిపై దాడి చేశారన్నారు. ఇసుక దోపిడీని ప్రశ్నించినందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఐదు నెలల కాలంలో నియోజకవర్గంలో 250 కేసులు రికార్డు స్థాయిలో నమోదు కావటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. నర్సీపట్నం టౌన్‌లో మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావుపై రౌడీ షీటర్ పప్పలనాయుడు హత్యాయత్నం చేశాడరన్నారు. కొత్తవీధిలో టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న బండారు కొండబాబు, రౌడీ షీటర్ బండారు సంతోష్ రెండు రోజుల క్రితం ఓ సామాన్య వ్యక్తిని హత్య చేశారన్నారు. వీరంతా స్పీకర్ అయ్యన్నపాత్రుడి ముఖ్య అనుచరులు కావటం గమనార్హమన్నారు. ఇందుకు సాక్ష్యంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అతని కుటుంబ సభ్యులతో నిందితులు ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. స్పీకర్ అనుచరుల చేతిలో హత్యకు గురైన మృతుడు నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, భార్యకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. టౌన్‌లో సూర్యోదయానికి ముందే వైన్ షాపులు తెరవటం వల్ల ఆకతాయిలు మద్యం సేవించి రెచ్చిపోతున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, టెంపుల మాజీ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, పార్టీ నాయకులు మళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు



మహంకాళి నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

డాబాగార్డెన్స్ (విశాఖ): జాతీయ స్థాయి యువజనోత్సవాల ఎంపిక పోటీలను మంగళవారం స్థానిక ఏవీఎన్ కళాశాలలో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అశోక్ మయూర్ యువజనోత్సవాల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. యువత యువజనోత్సవాల్లో పాల్గొని వారిలో నిబిడీకృతమైన కళలను బయటకు తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు మాట్లాడుతూ సాంస్కృతిక పోటీలు (జానపద కళారూపాలు), వక్తృత్వ, ఫొటోగ్రఫీ, చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. హైస్కూల్ విద్యార్థులతో సైంటిఫిక్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి సహకారంతో వివిధ స్కూళ్ల విద్యార్థుల ద్వారా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

కె.కోటపాడు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు తనిఖీ నిర్వహించారు. కార్యాలయం ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల వివరాలను వీరు అడిగి తెలుసుకున్నారు. స్టాంపు పత్రాలను నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలని స్టాంప్ వెండార్లకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 1 నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలతో పాటు ఇతర అంశాలపై కార్యాలయ సిబ్బందికి జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కొత్త మరుగుదొడ్ల మంజూరుకు సర్వే

- కలెక్టర్ విజయ కృష్ణన్



ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, బహిరంగ మలవిసర్జన నివారించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమని, పర్యావరణం, ఆరోగ్యాన్ని కాపాడేందుకు వాటిని నివారించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ముఖ్యమన్నారు.

విద్యార్థులు ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కొత్త మరుగుదొడ్ల మంజూరుకు, సామూహిక మరుగుదొడ్ల మరమ్మతులకు గ్రామీణ నీటి సరఫరా విభాగం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎ.ఎస్.ఎ. రామస్వామి మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా హమారా సౌచాలయ్ హమారా సమ్మాన్ నినాదంతో ప్రచారాన్ని డిసెంబర్ 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త మరుగుదొడ్ల మంజూరు కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా,శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టరు కె. అనంతలక్ష్మి, , గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టాలి

తుమ్మపాల: జిల్లాలో ఇంటింటి సర్వే చేసి ప్రతి ఇంటికి మరుగుదొడ్డి మంజూరు చేయాలని, డిసెంబరు 10 నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా తాగునీరు, పారిశుధ్య కమిటి సమావేశంలో ఆమె మండలాల వారీగా నిర్మాణ పనులు పురోగతిని సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

స్మార్ట్ మీటర్లు షాక్ కొడతాయి జాగ్రత్త!

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



దేవరాపల్లిలో బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్‌ను చూపిస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో స్మార్ట్ మీటర్ల బిగిస్తున్న వారిని మంగళవారం ఆయన ప్రశ్నించారు. దేవరాపల్లిలో గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. రాష్ట్రంలో మొదటి స్మార్ట్ మీటరు విశాఖలో బిగించి, తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలకు ప్రభుత్వం పూనుకుందని ఆయన విమర్శించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలు కొట్టాలని నారా లోకేష్ పిలుపునిచ్చారని వెంకన్న గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే శరవేగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తుండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యలతో డబ్బులు ఉంటేనే ఇకపై పేద ప్రజల ఇళ్లలో లైట్లు వెలుగుతాయని లేకుంటే అంధకారంలో మగ్గిపోవాల్సిందేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే దళిత గిరిజనుల ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం మంగళం పాడే అవకాశం ఉందని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన పార్టీ నేతలు



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ సీనియర్ నాయకుడు పైలా శ్రీనివాసరావు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.
- మునగపాక

'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ



యూనియన్ నాయకులతో కలిసి చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు గోపీనాథ్

నర్సీపట్నం: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న జరిగే సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు, జి.వి.రమేష్ పిలుపునిచ్చారు. యూనియన్ సభ్యులతో కలిసి మంగళవారం చలో విజయవాడ పోస్టర్‌ను గోపినాథ్ ఆవిష్కరించారు. ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాతన పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాజీ, దేముడు, కె.వి.రమణ, ఆర్.కె.నాయుడు, రవి పాల్గొన్నారు.

మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

- 26 మందికి నియామక పత్రాలు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శాస్త్రి

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఉద్యోగ మేళాను మంగళవారం నిర్వహించారు. ఎస్.కె.ఎల్.అసోసియేట్స్, హెల్త్ కేర్(విశాఖపట్నం) కంపెనీల్లో టెలికాలర్ మరియు హోమ్‌కేర్ ఉద్యోగాల కోసం 76 మంది ఉద్యోగార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వారికి రాత, మౌఖిక పరీక్ష నిర్వహించారు. వీరిలో 26 మందిని ఎంపిక చేసి, వారికి ఉద్యోగ నియామక పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.జయలక్ష్మి, ఉపన్యాసకులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే కుళాయి కనెక్షన్

- కాంట్రాక్ట్ సిబ్బంది చేతివాటం



గొడిచర్ల గ్రామంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయి పాయింట్ల వద్ద గ్రామస్తులు

నక్కపల్లి : 'కుళాయి కనెక్షన్ కావాలంటే డబ్బు కట్టాలి.. లేకపోతే కనెక్షన్ ఇవ్వం.. ఫ్రీగా కావాలంటే టైమ్‌పడుతుంది..అర్జంట్ అయితే మేము అడిగినంత డబ్బులు చెల్లించి కనెక్షన్ పొందండి..' అంటూ గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో కాంట్రాక్టు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభించింది. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి పైపు లైన్లు వేసి ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేయాలన్నది ఈ పథకం ఉద్దేశ్యం. గత ప్రభుత్వంలో నియోజకవర్గానికి సుమారు రూ.200 కోట్లు కేటాయించారు. సుమారుగా రూ.133 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఓవర్ హెడ్ ట్యాంకులు, బోర్లు నిర్మించి, ప్రధాన వీధుల్లో పైపులైన్లు వేసి, మెయిన్ పైపులైనుకు కుళాయి పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆపై మెయిన్‌లైను నుంచి లూపులైన్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. మండలంలోని గొడిచర్ల గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. మెయిన్‌లైనుకు ఆనుకుని ఉన్నవారికి, మెయిన్‌లైను నుంచి మూడు మీటర్ల దూరంలో ఉన్న లూపు లైన్లలో ఉన్నవారికి కనెక్షన్ ఉచితంగానే ఇస్తున్నారు. మూడు మీటర్లు దూరం దాటి ఉన్నవారికి మాత్రం కనెక్షన్ ఇవ్వడం లేదు. ఇదేమని కాంట్రాక్టర్లను అడిగితే ఫ్రీగా ఇప్పట్లో వేసే ప్రసక్తి లేదని, రెండో విడతలోనో, మూడో విడతలోను వేస్తామని, డబ్బులు ఇస్తే ఇప్పుడే వేసేస్తాం అని చెబుతున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కుళాయి కనెక్షన్ ఇవ్వాలంటే వెయ్యి రూపాయల నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారని, పైపులు, ట్యాపులు తెచ్చుకుంటే రూ.500 నుంచి వెయ్యి వసూలు చేస్తున్నారని వారు చెప్పారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి గ్రామానికి సగటున రూ.60 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ప్రభుత్వం విడుదల చేసింది. మెయిన్ పైపులైను, లూపులైన్లు, ట్యాపులు సైతం ఈ నిధుల నుంచే ఖర్చు చేయాలి. కానీ ఫ్రీగా ఇవ్వాల్సిన కనెక్షన్‌లను కూటమి ప్రభుత్వం వచ్చేక డబ్బులు వసూలు చేసి ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభూషణం వద్ద ప్రస్తావించగా కుళాయి పైపులైన్లు ఏర్పాటు పనులు కాంట్రాక్టు ఇవ్వడం జరిగిందని, పర్యవేక్షణ మాత్రం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖదేనన్నారు. డబ్బులు వసూలు చేస్తున్న విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

- మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దు
- ఎస్పీ తుహిన్ సిన్హా

నర్సీపట్నం: విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. పోలీసుశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంకల్పం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాదక ద్రవ్యాలకు యువత బానిసలుగా మారడమన్నది ప్రధాన సమస్యగా నేడు మారిందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన యువత ఏవిధంగా చెడిపోతున్నారో వివరించి, వారిని తిరిగి సన్మార్గంలో నడిపించేందుకు జిల్లా పోలీసుశాఖ సంకల్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. యువతపై మాదక ద్రవ్యాల ప్రభావంపై పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు సంబంధిత స్కూల్, కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. వీడియోలను ప్రదర్శిస్తున్నామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పట్టుబడిన నిందితులకు గరిష్టంగా 20 ఏళ్ల వరకు శిక్ష విధిస్తున్నారన్నారు. చట్టాల తీవ్రతను అర్థం చేసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలపై బానిసలైన యువకులు డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు డబ్బులు లేక చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడి నేరస్థులుగా మారుతున్నారన్నారు.

డ్రగ్స్ వినియోగదారులు, క్రయవిక్రయాలు జరిపే వారిపై నిఘా పటిష్టం చేస్తున్నామని, సరఫరా చేసే వారి సమాచారం 9392918196 తెలియజేయాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం మత్తు పదార్థాలతో యువత శరీరం, నాడీ వ్యవస్థపై దుష్ప్రభావాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్.కృష్ణ, సీఐలు గోవిందరావు, రేవతమ్మ, ఎస్సైలు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాల పంట



జోనల్ గేమ్స్, స్పోర్ట్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రఘు తదితరులు

- తెనుగుపూడి గురుకుల విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి : డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల జోనల్ స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌ను దేవరాపల్లి మండలం తెనుగుపూడి గురుకుల పాఠశాల విద్యార్థులు సొంతం చేసుకున్నారు. విజయనగరం జిల్లా కొప్పెర్ల గురుకుల పాఠశాలలో ఈ నెల 14 నుండి 16 వరకు జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు వివిధ విభాగాలలో 40 మంది సత్తా చాటారని గురుకుల ప్రిన్సిపాల్ పి.రఘు తెలిపారు. సీనియర్స్ ఖోఖో, కబడ్డీలో విన్నర్ గా, హ్యాండ్ బాల్‌లో రన్నర్‌గా నిలిచారు. 400 మీటర్ల రన్నింగ్‌లో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి సిహెచ్. సూర్యకిరణ్ రజత పతకం సాధించాడు. జూనియర్స్‌లో ఖోఖో విన్నర్, వాలీబాల్ రన్నర్‌గాను నిలిచారు. జూనియర్స్ విభాగంలో 100 మీటర్ల రన్నింగ్‌లో టెన్త్ విద్యార్థి ఎస్.గౌరీ మణిశంకర్, వినయ్‌కుమార్ రజతం, కాంస్య పతకాలు సాధించారు. 200 మీటర్ల రన్నింగ్‌లో టెన్త్ విద్యార్థి ఎస్.గౌరీ మణి శంకర్ స్వర్ణ పతకం సాధించాడు. 400 మీటర్ల రన్నింగ్‌లో గౌరీ మణిశంకర్, 8వ తరగతి విద్యార్థి ఆర్.తరుణ్ ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 800 మీటర్ల రన్నింగ్‌లో ఆర్.తరుణ్, 1500 మీటర్ల రన్నింగ్‌లో టెన్త్ విద్యార్థి బి.పార్థు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. జూనియర్స్ లాంగ్ జంప్, జావెలిన్ త్రోలో టెన్త్ విద్యార్థి ఎస్. సాయి వరుసగా గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించాడు. జూనియర్స్‌లో 4 ఇంటు 100 మీటర్ల రిలే పరుగు పోటీలో జి. గౌరీ మణిశంకర్, బి.వినయ్, ఆర్.తరుణ్, ఎస్. సాయి బంగారు పతకాలను సాధించారు. విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, నాగేశ్వరరావులను ప్రిన్సిపాల్ రఘు, స్కూల్ కమిటీ చైర్మన్ నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులతో పాటు పీఈటీలను ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల కోఆర్డినేటర్ ఎస్.రూపావతి అభినందించినట్టు ప్రిన్సిపాల్ రఘు తెలిపారు.

నేషనల్ వుషు టోర్నమెంట్‌కు నర్సీపట్నం విద్యార్థులు

నర్సీపట్నం : జమ్ము కాశ్మీర్‌లో ఈ నెల 22 నుండి 26 వరకు జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్ వుషు టోర్నమెంట్‌లో నర్సీపట్నం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ పదో తరగతి విద్యార్థి గండి జ్యోతి, డాక్టర్. బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థిని ముత్యాల పూజిత పాల్గొంటున్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ పోటీలకు తీసుకువెళ్తున్నట్టు కోచ్ శేఖర్ తెలిపారు.





వుషు క్రీడాకారులు గండి జ్యోతి, ముత్యాల పూజిత

సృజన వెలికితీసేందుకే బాలోత్సవ్

- విశాఖ బాలోత్సవంలో వక్తలు



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం



పోటీలో పాల్గొన్న వివిధ పాఠశాలల చిన్నారులు



రిహార్సల్స్ చేస్తున్న చిన్నారులు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విశాఖ బాలోత్సవం వేడుకగా ప్రారంభమైంది. విశాఖ బాలోత్సవం అధ్యక్షుడు పిల్లల మర్రి రఘు అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశాఖ బాలోత్సవం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. పిల్లలను ప్రోత్సహించేందుకు ఇటువంటి వేదికలను ఉపయోగించుకోవాలని స్కూల్ యాజమాన్యాలు, తల్లిదండ్రులకు సూచించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పిల్లలు దేనినైనా సూక్ష్మంగా గ్రహిస్తారన్నారు. కన్సర్న్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పీకే జోష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు చాలా అవసమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రత్నకుమార్ మాట్లాడుతూ విశాఖలోని బాలలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఇన్ని ఈవెంట్స్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కె.రమాప్రభ మాట్లాడుతూ రెండు నెలలుగా ఈ కార్యక్రమం కోసం కృషి చేయగా 120 పాఠశాలల నుంచి దాదాపుగా 8 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు 84 సాంస్కృతిక, ఈవెంట్స్ ఉంటాయని, తొలి రోజు 27 ఈవెంట్స్ నిర్వహించామన్నారు. 100 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఆసరా చారిటబుల్ సొసైటీ ప్రతినిధి శ్రీనాథ్, ఆహ్వాన సంఘం సభ్యురాలు కె సుశీల, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి వై.మోదాంబికా దేవి, ఎం.ఎల్లాజీ, ఎం.గుణశంకర్, వై.సత్యనారాయణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ గ్యాంగ్ ఆటకట్టు

- గ్యాంగ్‌లో ఆరుగురు అరెస్టు- మరొకరు ఇప్పటికే జైలులో..
- రూ. 15.5 లక్షల విలువైన 20 ద్విచక్రవాహనాలు స్వాధీనం



పట్టుబడిన ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : గత రెండేళ్లుగా బైక్‌చోరీలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను ఆమదాలవలస పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 15.5 లక్షల విలువైన 20 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బైక్ చోరీలే కాక బ్యాటరీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైళ్లు, వైన్‌షాపు, రోబరీల్లో నిందితులైన ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ నేరాలతో సంబంధమున్న మరో వ్యక్తి గంజాయి కేసులో ఇప్పటికే జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పత్రికా విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గత నెల 5వ తేదీ రాత్రి ఆమదాలవలసకు చెందిన ప్రైవేటు ఉద్యోగి కరణం శ్రీనివాసరావు తన ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో రంగంలోకి దిగిన ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్‌లు తమ సిబ్బందితో కలసి దర్యాప్తు కొనసాగించారు.

విచారణ కొనసాగించగా..

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి అర్జునరావు (37) దివ్యాంగుడు కావడం, ఏ పనిచేయక ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేవాడు. ఇతనికి ఆమదాలవలస కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, పలాస మండలం అంబుసోలికి చెందిన జడ్యాడ సోమేశ్వరరావు (21), విజయనగరం జిల్లా కొమరాడ మండలం కొట్టు గ్రామానికి చెందిన సప్ప హరీష్ (21), ఆమదాలవలస మెట్టెక్కివలసకు చెందిన మదాసు ధనుష్ (19)లు పరిచయమయ్యారు.

పథక రచన చేశారిలా..

అర్జునరావు వీరందరికి ఖర్చులకు డబ్బులివ్వడమే కాక ఉండటానికి గది అద్దెకిచ్చి రాత్రి పూట బైక్, ఇతర చోరీలు ఎలా చేయాలన్నదానిపై ప్రణాళిక రూపొందించేవాడు. దొరికిన బైక్‌లను ఏపీలో అమ్మితే సమస్యని, ఒడిశాలో అమ్మితే పోలీసులకు దొరికే అవకాశముండదని ఒడిశా గజపతి జిల్లా మినిగాన్‌కు చెందిన తన మిత్రుడు దారపు శేషగిరి (42) అతని బంధువైన ఏరుపల్లి బాలాజీ (సరుబుజ్జిలి మండలం, తురకపేట)ల సాయంతో అమ్మేవారు.

పట్టుబడ్డారిలా..

ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఆమదాలవలస మున్సిపాలిటీ గేట్ స్కూల్ కూడలి వద్ద ఎస్ఐ వెంకటేష్, తమ సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో జడ్యాడ సోమేశ్వరరావుపై విజయనగరం బొబ్బిలిలో మూడు, కాశీబుగ్గ, ఆమదాలవలసల్లో ఒక్కొక్కటి చొప్పున పాత కేసులుండగా సప్ప హరీష్‌పై బొబ్బిలిలో మూడున్నాయి. ఈ ఏడాది ఎన్డీపీఎస్ (గంజాయి) కేసులో అంపోలులో జైలుశిక్ష అనుభవిస్తున్న కారుణ్య జగదీష్‌పై బొబ్బిలిలో మూడు, ఆమదాలవలసల్లో నాలుగు కేసులుండటం విశేషం.

స్వాధీనం చేసుకున్న బైక్‌లు ఎక్కడెక్కడివి అంటే..

ఆమదాలవలస పీఎస్ పరిధిలో ఐదు, కాశీబుగ్గ పీఎస్ పరిధిలో ఐదు, శ్రీకాకుళం రూరల్, విజయనగరం 1టౌన్, విశాఖపట్నం3 టౌన్ లావేరు, ఎచ్చెర్ల పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున కాగా మరో ఐదు ద్విచక్రవాహనాలు వివరాలు తెలియాల్సి ఉంది. డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ సత్యనారాయణ, ఎస్ఐ వెంకటేష్, పీసీలు రాధాకృష్ణ, శ్యామలరావు, బాలకృష్ణలను ఎస్పీ అభినందించారు.

చిత్తులాట ఆడుతున్న నలుగురు అరెస్ట్

గొలుగొండ: అమ్మపేట గ్రామ సరిహద్దుల్లో చిత్తులాట (కాయిన్ ఆట) ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేశామని గొలుగొండ ఎస్ఐ పి.రామారావు తెలిపారు. ముందస్తు సమాచారంతో గ్రామ సమీపంలో ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని, ముద్దాయిల నుంచి రూ.7 వేల నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు



క్షతగాత్రులు



నుజ్జునుజ్జయిన కారు

అనకాపల్లి: స్థానిక డైట్ కళాశాల సమీపంలో మంగళవారం ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ వెంకట నారాయణ కథనం మేరకు వివరాలు....ఖమ్మం పట్టణం జెడ్పీ కాలనీకి చెందిన అశోక్‌కుమార్ పద్మావతి దంపతుల కుమార్తె వివాహం ఆదివారం విశాఖలో జరిగింది. వివాహం అనంతరం కుటుంబ సభ్యులైన అశోక్‌కుమార్, పద్మావతి, రామలింగం,అన్నపూర్ణ దంపతులతో పాటు మరో మహిళ లక్ష్మీశ్రీకరిలు అన్నవరం వెళ్లి తిరిగి విశాఖ వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కారు డ్రైవర్ రామలింగంతో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడడంతో ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులు విశాఖకు తరలించామన్నారు. కారు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమ మద్యంతో ఒకరి అరెస్టు



పాండిచ్చేరి మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తి

తుమ్మపాల: పాండిచ్చేరి (యానాం) మద్యం బాటిళ్ల కలిగిన వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. సీఐ లక్ష్మునాయుడు తెలిపిన వివరాల మేరకు కశింకోట మండలం జమ్మాదులపాలెం గ్రామానికి చెందిన కె.రామనత్యారావు పాండిచ్చేరి (యానం) నుంచి 7 రకాల మద్యం బాటిళ్లను తీసుకొస్తున్నట్టు తెలియడంతో దాడి చేసి పట్టుకున్నామని, మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించండి



ఎంపీడీవో కాశీవిశ్వనాథరావుకు వినతిపత్రం అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

కోటవురట్ల: అదనపు బాధ్యతల నుంచి విముక్తి కలిగించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు మొరపెట్టుకున్నారు. ఈమేరకు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా సంక్షేమ సహాయకులుగాను, డిజిటల్ సహాయకులుగానూ పనిచేస్తున్నామని, తమకు సంబంధించిన పనితో పాటు ఇతర శాఖల పనులు కూడా మాపై రుద్ది వెట్టి చాకిరీ చేయిస్తున్నారని వాపోయారు. ప్రతీ సోమ, గురువారాలలో పాఠశాలలకు వెళ్లి టీఎంఎఫ్ ఫొటోలు అప్‌లోడ్ చేయడంతో పాటు ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ స్కాలర్‌షిప్స్, హౌసింగ్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ బ్యాంకు లింకింగ్, పింఛన్ల పంపిణీ, బీఎల్‌వో డ్యూటీలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చేసే పనిని కూడా మాతోనే చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్లకు బీఎల్‌వో విధులు అప్పగించవద్దని జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ బేఖాతరు చేస్తూ బీఎల్‌వో విధులు చేయిస్తున్నారని ఆరోపించారు.

ప్రశ్నించేతత్వం లోపించడం వల్లే మహిళలపై అఘాయిత్యాలు

- రూరల్ సీఐ రేవతమ్మ



మాట్లాడుతున్న రూరల్ సీఐ రేవతమ్మ

నర్సీపట్నం: మహిళల్లో ప్రశ్నించే తత్వం లోపించడం వల్లనే అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన మహిళా దినత్సోవంలో సీఐ మాట్లాడారు. జీవితాంతం కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల మాటలు కాదని ఆడపిల్లలు తాత్కాలిక ఆకర్షణకు లోనై జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ఆడపిల్లలు చిన్నప్పుడు తల్లిదండ్రులపై, పెళ్లయిన తర్వాత భర్త మీద, తర్వాత కుమారుల మీద ఆధారపడవలసిన దుస్థితి ఇప్పటికీ కొనసాగడం దురదృష్టకరమన్నారు. కొంత మంది మహిళలు పదవుల్లోకి వస్తున్నా పురుషుల పెత్తనమే కొనసాగుతోందన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి దమయంతి, మహిళలు సీఐను సత్కరించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి, హాస్టల్ వార్డెన్ రాజ్యలక్ష్మి, మర్రిపాలెం డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ జి.మేరిపుష్ప పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

- కొరువాడలో 1600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లం పులుపును పట్టుకున్న ఎస్ఐ శేఖరం

కె.కోటపాడు/చోడవరం రూరల్ : నాటుసారా తయారీపై ముందస్తు సమాచారంతో కొరువాడలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు జరిపారు. చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ శేఖరం ఆధ్వర్యంలో గ్రామం శివారు గల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. తుమ్మ చెరువు పరిసర ప్రాంతాల్లో డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 1600 లీటర్ల బెల్లం పులుపును ఎక్సైజ్ సిబ్బంది గుర్తించి ధ్వంసం చేశారు. హెడ్ కానిస్టేబుల్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా సారా తయారీకి ఉపకరిస్తున్న బట్టీలన్నింటినీ కొరువాడ గ్రామానికి చెందిన కక్కల దేవుడు కుమారుడు రాము నిర్వహిస్తున్నట్టు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, పూర్తి విచారణ అనంతరం దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని చోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వి.పాపునాయుడు వెల్లడించారు.

క్లుప్తంగా

నేడు అన్నసమారాధన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్కు సెంటర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ అధ్యక్షుడు సీహెచ్.శేషు తెలిపారు. మంగళవారం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ ఏకాహం నిర్వహించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాట ఆడుతూ పట్టుబడిన నిందితులు, నగదుతో పోలీసులు

తుమ్మపాల: కశింకోట సత్తమ్మతల్లి కాలనీ ఏలేరు కాలువ గట్టు వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. కశింకోట ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.80,130 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక నెహ్రూచౌక్‌లో ఆమె చిత్ర పటం ఉంచి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలపు రెడ్డి కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు తుట్టా రమణ, బోయిన భాను మూర్తియాదవ్, జిల్లా నాయకులు సేనాపతి రాజు, కె.వి.మాణిక్యం, కట్టమూరి నూక అప్పారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 2,228 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,230
మొదటి రకం	3,500	4,300
రెండో రకం	3,310	3,760
మూడోరకం	3,000	3,300

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మట్కా	: షిర్డిసాయి
గ్లాడియేటర్	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 381 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించాలి.



వరండాలో 6వ తరగతి విద్యార్థులు



మధ్యాహ్న భోజనం పథకం వంటశాల



ఒకే షెడ్‌లో 5,7,8 తరగతుల విద్యార్థులు

రేకుల షెడ్లలోనే చదువులు



రేకుల షెడ్‌లో 9వ తరగతి విద్యార్థులు

సర్కారు బడి.. పిల్లలు సమస్యల ఒడిగా మారింది. నేటి బాలలే రేపటి పౌరులు అన్న పిలుపునకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధి ఎన్టీఆర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చదువులు రేకుల షెడ్లు, చెట్ల కింద సాగుతుండడమే ఇందుకు నిదర్శనం. వేసవి కాలంలో షెడ్లలో ఉండలేక, వర్షాలు పడే సమయంలో తడుస్తూ, శీతాకాలంలో చలికి వణికిపోతూ విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు.

- ఎన్టీఆర్ కాలనీ ప్రాథమిక, హైస్కూళ్ల విద్యార్థుల అవస్థలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.1.52 కోట్లతో హైస్కూల్‌కు కొత్త భవనం నిర్మాణం
- ప్రారంభోత్సవంపై కూటమి సర్కారు మీనమేషాలు

అనకాపల్లి: అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో సుమారు 25 ఏళ్ల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను 15 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేశారు. ఈ కాలనీకి ఆనుకుని ఉన్న గ్రామాలు మారేడుపూడి, పూసర్లకాలనీ, గణేష్‌నగర్, వెంకటరమణపేట, శీరంశెట్టివానిపాలెం, అక్కిరెడ్డిపాలెం విద్యార్థులు ఈ పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకూ 375 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇక్కడ బోధన చేస్తున్నారు. పిల్లల శాతాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక పాఠశాలను 2018లో హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసింది. అయితే ఆ స్థాయిలో సదుపాయాలు మాత్రం కల్పించలేదు. 15 సెంట్ల స్థలంలో నిర్మించిన ఎలిమెంటరీ పాఠశాలలోనే అంగన్‌వాడీ కేంద్రం, విద్యార్థులకు బోధన, మధ్యాహ్న భోజన పథకం భవనాలు నిర్మించారు. ఇక్కడున్న 4 గదుల్లో ఓ గదిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. రెండు గదుల్లో పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్నారు. మరో ఇరుకు గదిలో 1, 2, 3 తరగతి పిల్లలు ఉంటున్నారు. దీంతో విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదు.

ఇవీ సమస్యలు

- ప్రాథమిక పాఠశాలలో హైస్కూల్ విద్యార్థులు చదువుకోవడంతో తరగతి గదులు చాలడం లేదు.
- విద్యార్థులు చెట్ల కింద, ఆరుబయట చదువుకోవడంతో ఎంపీపీ నిధులతో మూడు పెద్ద రేకుల షెడ్లను నిర్మించారు.
- స్థానిక ప్రజల సహకారంతో మరో రెండు రేకుల షెడ్లు నిర్మించారు.
- మూడు రేకుల షెడ్లలో 5, 7, 8 తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ఒక షెడ్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులు, మరో షెడ్‌లో 4, 6 తరగతుల విద్యార్థులకు బోధన చేస్తున్నారు.
- వేసవి కాలంలో ఎండకు రేకుల షెడ్ల కింద ఉండలేకపోతున్నారు. వర్షాలు పడినప్పుడు, శీతాకాలంలో చలికి షెడ్లలో విద్యార్థులు నరకయాతన పడుతూ బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారు.

కొత్త భవనం ప్రారంభమెప్పుడో?



ప్రారంభానికి నోచుకోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ఎన్టీఆర్ కాలనీ హైస్కూల్ భవనం



కొత్త భవనం వద్ద మరుగుదొడ్లు

వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రాథమిక పాఠశాలకు 200 మీటర్ల దూరంలో హైస్కూల్ భవనాన్ని నిర్మించారు. 4.33 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నాడు-నేడు పథకం కింద రూ.1.52 కోట్ల నిధులతో ఆరు తరగతులు ఉన్న పెద్ద భవనాన్ని డిసెంబర్ 2023 నాటికి పూర్తి చేశారు. మరుగుదొడ్లు, తాగునీటి బోరు, విద్యుత్ సదుపాయాలు కల్పించారు. ప్రస్తుత ప్రభుత్వం తాగునీటి బోరు నుంచి మరుగుదొడ్లకు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి, హైస్కూల్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తే సరిపోతుంది. ఈ భవనం నిరుపయోగంగా ఉండడంతో రాత్రి సమయంలో మందుబాబులకు నిలయంగా మారింది. ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకుని కొత్త భవనాన్ని ప్రారంభించి ప్రాథమిక పాఠశాల నుంచి హైస్కూల్‌ను వేరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువుకు ఇబ్బందిగా ఉంది



తరగతి గదులు ఇరుకుగా ఉన్నాయి. 5 నుంచి 10వ తరగతి వరకూ ఇబ్బందులు పడుతూ చదువుతున్నాం. షెడ్ల కింద బోధన చాలా ఇబ్బందిగా మారింది. తక్షణం కొత్త భవనంలోకి హైస్కూల్‌ను తరలించాలి.

– ఆర్.వర్షిత, 10వ తరగతి,

భయం.. భయంగా చదువులు



6వ తరగతిలో చెట్ల కింద, నేలపై చదువుకునే వాడిని. మూడు సంవత్సరాలు క్రితం షెడ్లు నిర్మించారు. ప్రస్తుతం షెడ్లలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. షెడ్ పక్కన పెద్ద చెట్టు ఉంది. వర్షం, గాలి వీచినప్పుడు కూలిపోతుందేమోనని భయంగా ఉంటోంది.

– ఈగల చైతన్యసాయి, 9వ తరగతి

పాఠాలు అర్థం కావడం లేదు



పెద్ద షెడ్లలో ఉపాధ్యాయులు బోధిస్తుంటే పాఠా లు సరిగ్గా అర్థం కావడం లేదు. ఓపెన్ షెడ్ కారణంగా మధ్యలో చిన్నపాటి గోడ కూడా లేకుండా పోయింది. మూడు తరగతులకు వరుసగా బెంచీలపై కూర్చోవడంతో ఇబ్బంది పడుతున్నాం. కొన్ని సందర్భాల్లో ఉపాధ్యా యులు ఆరుబయట కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు.

– జి.మోహన్, 8వ తరగతి విద్యార్థి

తప్పని పరిస్థితిలో పిల్లలను పంపుతున్నాం..



ఇంటి పక్కనే హైస్కూల్ ఉండడంతో పాప, బాబును పంపుతున్నా. ఎలిమెంటరీ పాఠశాలలో హైస్కూల్ నిర్వహణతో గదులు చాలడం లేదు. నేలపైన కూర్చుని చదువుకోవడం చూస్తున్నాం. పిల్లలను దూరంగా పంపించలేక ఇక్కడే ఉంచి చదివిస్తున్నాను. హైస్కూల్ భవనం నిర్మించారు. ప్రారంభిస్తే బాగుంటుంది.

– తంగేటి దేవి, విద్యార్థి తల్లి, ఎన్టీఆర్ కాలనీ

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో నరసింహరావు

అనకాపల్లి: గ్రామీణ స్థాయి నుంచి వ్యక్తిగత మరుగుదొడ్లపై వచ్చేనెల 10వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని వాడడం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రభుత్వం సబ్సిడీపై కొంత నిధులు మంజూరు చేస్తుందని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ముగ్గురు పారిశుధ్య కార్మికులను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఈవోఆర్డీ కె.వి.వి.ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమ బిందు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లి: జోనల్ పరిధిలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని, పట్టణ నడిఒడ్డున ఉన్న డంపింగ్‌యార్డును తక్షణమే తరలించాలి ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక జోనల్ కార్యాలయంలో వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్న యాదవ్ మాట్లాడుతూ జోనల్ కార్యాలయం, గృహాలు, జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద కంపోస్టు యార్డును నిర్వహించడంతో ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారని చెప్పారు. కుళాయిల ద్వారా పరిశుభ్రమైన నీరు రావడంలేదన్నారు. పట్టణ, మండల పరిధిలో తాగునీటి పైపులైన్లు పాడైపోయాయని చెప్పారు. రహదారులపై దుకాణాల ఏర్పాటుతో పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్యతో నిత్యం వేలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దుకాణాల సెల్లార్లలో వాహనాలు పార్కింగ్‌పై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, కొల్లు సత్యారావు, చింతకృష్ణ త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల పరిరక్షణ అందరి బాధ్యత



కశింకోట గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్స్ పోటీలో విద్యార్థులు



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న గొంతిన రంగబాబు

తుమ్మపాల: గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో వి.వి.రవి కుమార్ అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కశింకోట గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివన్నారు. అంతకు ముందు విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ, ఏపీజీవీబీ బ్యాంకుల మేనేజర్లు ఎం.మహాలక్ష్మి, కె.కవిత, గుణదేవ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గురుదేవ్‌జీ, గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి, శిష్టి అప్పారావు, యల్లపు రామచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాహితిమిత్రుల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత, సంస్థ పట్టణ కన్వీనర్ గొంతిన రంగబాబు మాట్లాడుతూ విద్యార్థులు, సాహితీవేత్తలు గ్రంథాలయ సేవలు ఉపయోగించుకోవాలన్నారు. డాక్టర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి మాట్లాడుతూ ఇటీవల సహితీ మిత్రులు సాధించిన విజయాల గురించి ఆయన వివరించారు. అనంతరం కవులను శాలువాలతో రంగబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, కవులు ఎం.రామారావు, బళ్లా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



కొత్తూరు పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న కార్మిక శాఖ అధికారులు, పోలీసులు

అనకాపల్లి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల కార్మిక శాఖ అధికారులు బాలకృష్ణ, నరేంద్ర అన్నారు. కొత్తూరులోని పలు పరిశ్రమల్లో కార్మిక శాఖ, పోలీసు, ఐసీడీఎస్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, నరేంద్ర మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలతో పరిశ్రమల్లో పని చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ ప్రతినిధులు డి.లోవరాజు, మంగ, సీడీపీవో సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వరిలో పురుగు నివారణపై దృష్టి సారించాలి



శాస్త్రవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న టి.శ్రీలత

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో రెల్ల రాల్చు పురుగు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణపై దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ టి.శ్రీలత అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ, వేప నూనె 5.0 మి.లీ. లీటరులో కలిపి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలన్నారు. పూత దశలో ఉన్న ఆర్‌జీఎల్ వరి రకంలో మానిపండు తెగులు, మెడ విరుపు తెగులు ఎక్కువగా ఆశిస్తున్నందున లీటరు నీటికి 1 మి.లీ, ప్రోపికొనజోల్‌ను పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. లోతట్టు ప్రాంతాలలో వేసిన చెరకు గత వర్షాలకు మునిగి ఉంటే వీలైనంత త్వరగా కోసి బెల్లం ఆడుకోవాలన్నారు. లేని పక్షంలో ఫ్యాక్టరీకి తరలించాలన్నారు. రబీలో వేరుశనగ వేసే రైతులు అధిక దిగుబడినిచ్చే మేలైన రకాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. ఒకటి, రెండు తడులు పెట్టే వీలున్నట్లయితే వరి మాగాణుల్లో పెసర లేదా మినుములు వేసుకోవచ్చన్నారు. కాప్టన్ 2.5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలని ఆమె సూచించారు. వరి మాగాణుల్లో జనుము వేసే రైతులు ఎకరానికి 10 కిలోల చొప్పున విత్తుకోవాలన్నారు. జెఆర్‌జె.610 జనుము విత్తనం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద వెలుగు వీవోఏల ధర్నా



మాడుగుల వెలుగు కార్యాలయంలో నోటీసు అందజేస్తున్న వెలుగు వీఓఏలు

మాడుగుల రూరల్ : వెలుగు వీఓఏలు తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు వీఓఏలు హాజరు కావాలని జిల్లా వెలుగు వీఓఏల సంఘం ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మాడుగుల వెలుగు కార్యాలయంలో ఏపీఎంవో అప్పలనర్సమ్మకు ధర్నా నోటీసును వీవోఏలతో కలిసి అందజేశారు.

సత్యసాయి జయంత్యుత్సవాలు ప్రారంభం



పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ముక్కా అప్పలనాయుడు

తుమ్మపాల: కశింకోట మండలం కోమటి వీధిలోని శ్రీసత్యసాయి సేవా మందిరంలో సత్యసాయి జయంత్యుత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభయయ్యాయి. ఈ నెల 23 వరకు భక్తుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మందిర కన్వీనర్ ముక్కా అప్పలనాయుడు తెలిపారు. నారాయణ సేవలు, రుద్రాభిషేకాలు, బాలవికాస పిల్లలతో నృత్యాలు, నాటికలు, నగర సంకీర్తనలు, నిత్య భజనలు చేపడతామన్నారు. ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా పేద మహిళలకు వస్త్రదానం చేశారు.

26న అనకాపల్లిలో మహా ధర్నా

అచ్యుతాపురం: అనకాపల్లిలో సీఐటీయూ, రైతు సంఘం నాయకులు ఈ నెల 26న మహా ధర్నా నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము తెలిపారు. మహా ధర్నా కోసం రైతుల్లోనూ, కార్మికుల్లోనూ చైతన్యం తీసుకొచ్చేందుకు పెదపాడులో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ, జనపరెడ్డి సత్యనారాయణ, వరలక్ష్మి, సముద్రాలు పాల్గొన్నారు.

నేటి నుంచి వైభవ వెంకన్న కల్యాణోత్సవాలు



వైభవ వేంకటేశ్వర స్వామి



కల్యాణోత్సవాలకు ముస్తాబైన ఆలయం

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో బుధవారం నుంచి వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. శనివారం వరకు జరిగే ఈ మహోత్సవాల కోసం చలువ పందిళ్లు, పుష్పాలు అలంకరణ, మాడవీధులు పరిశుభ్రత, చక్రస్నానానికి కోనేరులో ఏర్పాట్లు, కోలాటం, భరతనాట్యం ప్రదర్శనకు అవసరమైన వేదికల ఏర్పాటు చేశారు. సుమారు 500 మంది దంపతులు ఏకకాలంలో కూర్చుని స్వామి కల్యాణ మహోత్సవంలో పాలు పంచుకునేలా మండపాన్ని తీర్చిదిద్దారు. ఆలయ నిర్మాణం తరువాత స్వామి వారికి 9వ వార్షిక కల్యాణం కావడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమంతో దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు.

అంబరాన్నంటిన అంబలం పూజ



అంబలం పూజలో స్వామిని దర్శించుకుంటున్న ప్రసాద్

మునగపాక: మండల కేంద్రం మునగపాకలోని సంతబయిలులో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజ అంబరాన్నంటింది. గురుస్వామి వేగి రామకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన అంబలం పూజలో ఆలపించిన గీతాలు అందరినీ భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అయ్యప్ప నామస్మరణతో మునగపాక మార్మోగింది. ఈ అంబలం పూజకు పరిసర ప్రాంతాలకు చెందిన స్వాములు భారీగా తరలివచ్చారు. స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, తదితరులు దర్శించుకున్నారు.

రైతుల అంగీకారంతోనే భూసేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం: రైతుల అంగీకారంతోనే భూసేకరణ చేస్తామని, ప్రభుత్వ సర్వేయర్లు చేస్తున్న సర్వేతో ఆందోళన చెందవద్దని తహసీల్దార్ రమేష్‌బాబు అన్నారు. గుర్రాజుపేట గ్రామంలో మంగళవారం రైతులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా గుడివాడ రెవెన్యూ గుర్రాజుపేట గ్రామంలో 140, 139, 176, 151 తదితర సర్వే నంబర్ల నుంచి 206 వరకు సుమారు 529.92 ఎకరాలు భూమి వివరాలు తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. భూమిని గుర్తించిన తరువాత ప్రభుత్వానికి అవసరం ఉంటే నోటిఫికేషన్ విడుదల చేసి రైతులను ఒప్పించి తీసుకుంటారన్నారు. ఈ మేరకు రైతులు తమ భూముల్లో సర్వే ఎందుకు చేస్తున్నారో స్పష్టంగా తమకు తెలియపరిచి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి పనులు చేపడతామని తహసీల్దార్ చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు రామరాజు, చంటిరాజు, మధురాజు, శ్రీనివాసరావు, రమేష్, సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.